



ఉగాది ఆస్థాన పూజల్లో స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, పీవీఆర్ కృష్ణారావు, మోహన్‌రావు తదితరులు

శ్రీవారి ఆలయంలో
వైభవంగా ఉగాది ఆస్థానం

- తరలివచ్చిన భక్తజనం
- ఆలయ విస్తరణకు జీఆర్‌టీ అధినేతల రూ.కోటి విరాళం

ప్యారీస్, ఏప్రిల్ 9: స్థానిక టి.నగర్‌లోని టీటీడీ సమాచార కేంద్రం పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఉగాది ఆస్థాన వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయంలో ప్రత్యేక ఆరాధన, పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత గర్భాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పరివేటధారణ చేశారు. ఆ తర్వాత ఏజే శేఖర్, మండలి సభ్యులు, నగర ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో కలసి శ్రీవారికి పట్టువస్త్రాలు, ఫల పుష్పాది, సుగంధ ద్రవ్యాలను సమర్పించారు. అనంతరం ఆలయ గర్భాలయం ముందున్న హాలులో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది ఆస్థానం సందర్భంగా ఉత్సవమూర్తులపై తలంబ్రాలుగా ప్రత్యేక అక్షతలను ధారగా పోశారు. ఈ అక్షతలను ఆస్థానం ముగిసిన తర్వాత భక్తులకు పంచి పెట్టారు. ఓ వైపు పూజాది కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ఉదయం 9.30 గంటలకు భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉదయం 8 గంటలకే నగరం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు శ్రీవారి దర్శనం కోసం ఆలయం ముందున్న మండపం వద్ద బారులుతీరారు. క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పద్మావతి సమేత సర్వాలంకరణ శోభితుడైన వేంకటేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. ఉగాది సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు, రకరకాల పూలతో అలంకరించారు. ఇదిలా ఉండగా జీఆర్‌టీ జ్యువెలర్స్ అధినేత రాజేంద్రన్, జీఆర్‌టీ ఎండీలు ఆనంద్, రాధాకృష్ణ కుటుంబ సభ్యులు చెన్నైలో నిర్మితం కానున్న శ్రీవారి ఆలయ విస్తరణ భూదాన పథకం కోసం కోటి రూపాయలను విరాళంగా ఏజే శేఖర్ వద్ద అందజేశారు.



ఏజే శేఖర్‌కు చెక్కు అందజేస్తున్న జీఆర్‌టీ జ్యువలర్స్ అధినేతలు

15న ప్రియాంక రాక

- 16న మల్లికార్జున ఖర్గే



ప్యారీస్, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేపట్టేందుకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి రానున్నారు. కరూర్, మైలాడుదురై, శివగంగ లోక్‌సభ నియోకవర్గాల్లో 15న నిర్వహించనున్న రోడ్‌షోలో ప్రియాంక గాంధీ పాల్గొని ప్రచారం చేయనున్నారు. అదే విధంగా కడలూరు, కృష్ణగిరి నియోజకవర్గాల్లో 16న మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ కూటమి అభ్యర్థులతో కలసి ప్రచారంలో పాల్గొననున్నారు. ప్రియాంక గాంధీ 15వ తేది ఉదయం ప్రత్యేక విమానంలో తిరుచ్చి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వెళ్లి శివగంగ, మైలాడుదురై, కరూర్ నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొంటారు. ఈ ఇద్దరు అగ్రనేతలు పాల్గొనే ప్రచారసభలకు భారీస్థాయిలో ప్రజలను తరలించే ఏర్పాట్లను అభ్యర్థులు, కాంగ్రెస్ శ్రేణులు చేపట్టాయి. కాగా, కోవై, తిరునల్వేలి నియోజకవర్గాల్లో ఈ నెల 12న కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ప్రచారంలో పాల్గొంటారని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ప్రకటించింది.

ఆర్‌ఎం వీరప్పన్ కన్నుమూత

సీఎం సహా మంత్రుల నివాళి



ఆర్‌ఎం వీరప్పన్ (ఫైల్‌ఫొటో)



వీరప్పన్ పార్థివదేహానికి అంజలి ఘటిస్తున్న సీఎం

పెరంబూర్, ఏప్రిల్ 9: మాజీ మంత్రి ఆర్‌ఎం వీరప్పన్ (98) కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్యానికి గురైన ఆయన్ని కొద్దిరోజుల క్రితం కుటుంబసభ్యులు థౌజండ్ లైట్స్ సమీంపలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనకు చికిత్స అందిస్తున్న నేపథ్యంలో, మంగళవారం ఉదయం మృతిచెందారు. రాష్ట్రంలోని సీనియర్ ద్రావిడ నేతల్లో ఆర్‌ఎం వీరప్పన్ ముఖ్యుడు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ మంత్రిమండలిలో హిందూ దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు జానకి, జయలలిత తదితరుల మంత్రివర్గంలోనూ ఆయన మంత్రిగా వ్యవహరించారు. అన్నాడీఎంకేలో ఉన్నా, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి, డీఎంకే నేతలతో సన్నిహితంగా ఉండే వ్యక్తి వీరప్పన్. అన్నాడీఎంకే నుంచి వైదొలిగిన ఆయన 'ఎంజీఆర్ కళగం' అనే పార్టీని ప్రారంభించారు. సినీరంగంలో ఎంజీఆర్‌కు కుడిభుజంగా ఉన్న ఆర్‌ఎం వీరప్పన్, సత్య మూవీస్ సంస్థను ప్రారంభించి పలు చిత్రాలు నిర్మించారు. అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఆర్‌ఎం వీరప్పన్‌కు పలు పార్టీల నేతలు, సినీ రంగ ప్రముఖులు సంతాపం తెలిపారు.

సీఎం నివాళి....: స్థానిక అపోలో ఆసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆర్‌ఎం వీరప్పన్ మృతదేహానికి నివాళి అర్పించారు. సీఎం వెంట మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాప ప్రకటన విడుదల చేశారు. 'ద్రావిడ ఇయక్కం ఆవిర్భావానికి ముఖ్యుల్లో ఒకరు, ఎంజీఆర్ కళగం పార్టీ అధ్యక్షుడు ఆర్‌ఎం వీరప్పన్ మృతి చెందారనే వార్త నాకు దిగ్భ్రాంతి, ఆవేదన కలిగించింది. ఆయన 98వ జన్మదినం సందర్భంగా గత ఏడాది సెప్టెంబరు 9వ తేది నేరుగా ఆయన ఇంటి వెళ్లి శుభాకాంక్షలు తెలిపా. రాజకీయాల్లోనే కాకుండా సినీ రంగంలో కూడా తనదైన ముద్ర వేసిన వ్యక్తి ఆర్‌ఎం వీరప్పన్. శతాబ్ది దాటి నిండు జీవితం గడపాలన్న ఆయన శ్రేయోభిలాషుల నిరీక్షణ నెరవేరకపోవడం బాధాకరం. 'ఆర్‌ఎంవీ' అని అందరూ ప్రేమగా పిలుచుకొనే ఆర్‌ఎం వీరప్పన్, పెరియార్, అన్నా, ఎంజీఆర్, దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వంటి నేతలతో సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా నిలిచారు. ఎంజీఆర్‌కు మనస్సాక్షిగా, నీడగా వీరప్పన్ మెలిగారు. ఆ తర్వాత ఎంజీఆర్ కళగం పేరుతో తనకంటూ ఓ ప్రత్యేక ఉద్యమాన్ని ప్రారంభించినా, రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగాను డీఎంకేతోను, కరుణానిధితోను సత్సంబంధాలు కొనసాగించారు. ఆయన ఎంజీఆర్‌కు సొంతమైన సత్య మూవీస్ కూడా నిర్వహించడంతో పాటు తమిళ చిత్ర పరిశ్రమకు అనేక హిట్ చిత్రాలు అందించిన నిర్మాతగా పేరు పొందారు. తమిళంపై తనకున్న మక్కువ కారణంగా 'చెన్నై కంబన్ కళగం' అధ్యక్షుడిగా మారి సాహిత్య రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. రాజకీయాలు, సినిమారంగం, ఆధ్యాత్మికం అలా అన్ని రంగాల్లో విజయాలు సాధించిన ఆర్‌ఎం వీరప్పన్, రాజకీయ విభేదాలు దాటుకొని అన్ని పార్టీల అభిమానంతో పార్లమెంటేరియన్‌గా ఎదిగారు. ఆయన మృతి రాజకీయ ప్రపంచానికే కాకుండా సినీ, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో ఆయనతో పాటు పనిచేసిన వారికి తీరని లోటు. ఆయన భార్య, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలుతున్నాను. ద్రావిడ ఉద్యమం ఉన్నంత కాలం ఆర్‌ఎం వీరప్పన్ కీర్తి నిలిచి ఉంటుంది' అని ముఖ్యమంత్రి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. దివంగత మాజీ మంత్రి ఆర్‌ఎం వీరప్పన్‌కు నటుడు రజనీకాంత్ నివాళి అర్పించారు. స్థానిక టి.నగర్‌లోని నివాసానికి వెళ్లిన రజనీ, ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలు... : ఆర్‌ఎం వీరప్పన్ అంత్యక్రియలు బుధవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రి నుంచి ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం టి.నగర్‌లోని నివాసానికి తరలించారు. బుధవారం నుంగంబాక్కంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.



దర్యాప్తు సంస్థల్ని పార్టీ విభాగాలుగా మార్చేశారు

మదురై సభలో మోదీపై స్టాలిన్ ధ్వజం



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో నిష్పక్షపాతంగా పని చేసి న్యాయం వైపు నిలబడాల్సిన సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ పార్టీ విభాగాలుగా మార్చేశారని, ఆ సంస్థలన్నీ ప్రస్తుతం ఆ పార్టీకి వంతపాడుతున్నాయని, రాజకీయ ప్రత్యర్థులపైనే కక్షగట్టి దాడులు జరుపుతున్నాయని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. మదురైలో మంగళవారం సాయంత్రం ఏర్పాటైన ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి వెంకటేశన్, శివగంగ కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరానికి మద్దతుగా ఏర్పాటైన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ... ఎన్నికల్లో ఓట్ల కోసం పదే పదే రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ హింసాత్మక సంఘటనలతో అట్టుడికి పోయిన మణిపూర్ రాష్ట్రానికి ఎందుకు వెళ్ల లేదో సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. నారీ శక్తి, స్త్రీ శక్తిని కాపాడేది తామేనంటూ గొప్పలు చెప్పకుంటున్న మోదీ... మణిపూర్‌లో బలహీన వర్గాలకు చెందిన యువతులపై సామూహిక అత్యాచారాలు జరిగినా, నగ్నంగా ఊరేగించినా నోరుమెదపక మౌనం పాటించారని మండిపడ్డారు. ఇక మహిళా బాక్సర్లు లైంగిక వేధింపులకు గురై ఢిల్లీలో బోరున విలపిస్తే మోదీ ఇసుమంతైనా బాధపడలేదన్నారు. ఇక గుజరాత్‌లో అత్యాచారానికి గురైన బానో కేసు ముద్దాయిలను విడుదల చేయించిన ఘనత కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పుల్వామా దాడులను మోదీ ఎలా రాజకీయం చేశారో దేశ ప్రజలందరికీ తెలుసునన్నారు. ఆ దాడులను ప్రస్తావిస్తూ మోదీపై ఆరోపణలు చేసిన కశ్మీర్ గవర్నర్ నివాసగృహంలో దాడులు జరిపించారన్నారు. పదేళ్లుగా అవినీతి నిర్మూలిస్తానంటూ శపథాలు చేసిన మోదీకి అవినీతిని అంతమొందించే యోచనేలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి ఎవరు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం బతుకుతుందో వారినే గెలిపించాలని, మతతత్వ వాదాన్ని, కుల చిచ్చును రగిల్చే బీజేపీని చిత్తుగా ఓడించి, దేశంలో సామాజిక న్యాయం బతికేందుకు దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు.



బస్సును ఢీకొన్న కారు

- తిరుప్పూరు జిల్లాలో ఐదుగురి మృతి



క్రేన్ సాయంతో కారును తొలగిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 9: తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ప్రభుత్వ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతిచెందారు. తిరుప్పూర్ నల్లిగౌండన్‌నగర్ పుదునగర్ 7వ వీధికి చెందిన చంద్రశేఖరన్ సహా ఆరుగురు కారులో తిరుకడయూర్ ఆలయానికి వెళ్లారు. స్వామి దర్శనం అనంతరం వారు తిరుగు ప్రయాణం కాగా, కారును చంద్రశేఖరన్ చిన్న కుమారుడు ఇళవరసన్ (26) నడుపుతున్నాడు. వెల్లకోయిల్ - కాంగయం జాతీయ రహదారిలో వస్తున్న కారు ఊహించని విధంగా తిరుప్పూర్ నుంచి తిరుచ్చి వైపుకు వెళుతున్న ప్రభుత్వ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణిస్తున్న చంద్రశేఖరన్(60), ఆయన భార్య చిత్ర(57), చిన్న కుమారుడు ఇళవరసన్, పెద్ద కుమారుడు శశిధరన్ భార్య అరువిచిత్ర (30), శశిధరన్ మూడు నెలల కుమారుడు సాహి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న శశిధరన్‌ను చుట్టపక్కల వారు సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, కరూర్ జిల్లా మాణిక్యపురానికి చెందిన బస్సు డ్రైవర్ సామినాథన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పాండీ బజార్‌లో మోదీ రోడ్‌షో

- అడుగడుగునా పూలవర్షం
- అలరించిన నృత్య, వాద్య ప్రదర్శనలు
- 'మోదీ...మోదీ' అంటూ మిన్నంటిన నినాదాలు





ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ - ప్రధానిపై పూలవర్షం కురిపిస్తున్న కార్యకర్తలు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, వినోజ్ పి. సెల్వం, పాల్ కనకరాజ్‌కు మద్దతుగా ఓట్ల వేట సాగించేందుకు నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన టి.నగర్, పాండీబజార్‌లో ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సాయంత్రం రోడ్‌షో నిర్వహించారు. ఐదంచెల పోలీసుభద్రతా ఏర్పాట్ల నడుమ, కేంద్ర పారిశ్రామిక దళం అధికారులు స్వీయపర్యవేక్షణతో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య సాగిన ఈ రోడ్‌షోకు బీజేపీ కార్యకర్తల నుంచి మంచి స్పందన లభించింది. ఈ రోడ్‌షోలో పాల్గొనే నిమిత్తం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్ర నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 6.15 గంటలకు చెన్నై విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి కారులో నందనం మీదుగా టి.నగర్ పానగల్ పార్కుకు చేరుకున్నారు. ఈ రోడ్‌షో కోసం మధ్యాహ్నం 3 గంటల నుంచే పాండీబజార్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అదే సమయంలో రోడ్‌షోలో పాల్గొనే నిమిత్తం బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు పాండీబజార్ రహదారికి ఇరువైపులా బారులు తీరారు. పానగల్ పార్కు వద్ద మోదీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, బీజేపీ అభ్యర్థులు తమిళిసై సౌందరరాజన్, వినోజ్ పి.సెల్వం, పాల్ కనకరాజ్, వేలూరు అభ్యర్థి ఏసీ షణ్ముగం తదితరులు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత కాషాయ రంగు కలిగిన ఓపెన్‌టాప్ వాహనంపై మోదీ... నగరంలో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు, అన్నామలైతో కలిసి బయలు దేరారు. అప్పటికే ఆ రహదారికి ఇరువైపులా నిలిచిన పార్టీ కార్యకర్తలు, స్థానికులు, వ్యాపారులు, కార్మికులు భారత్‌మాతాకీ జై,మోదీ, మోదీ... వేండుం మోదీ మీండుం మోదీ (మోదీ కావాలి... మళ్లీ మోదీ రావాలి) అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేపట్టారు. ఈ రోడ్‌షోలో మోదీ తమిళ సంప్రదాయ దుస్తులైన పట్టుధోవతి, తెలుపురంగు చొక్కా ధరించి పాల్గొన్నారు.ఓ చేత తామర గుర్తును ప్రజలకు చూపుతూ వెళ్లారు. రహదారికి ఇరువైపులా పలు చోట్ల జానపద కళాకారులు కాళికాదేవి, పార్వతీదేవి, భారత మాత తదితర దేవతామూర్తుల వేషధారణతో నిలిచారు. వారిని చూడగానే మోదీ శిరస్సు వంచి నమస్కరించారు. అదే విధంగా రోడ్‌షో మార్గంలో పదిమందికిపైగా నాదస్వర కళాకారులు వరుసగా కూర్చుని నాదస్వరాన్ని వాయించడంచూసి మోదీ ఆనందం వ్యక్తం చేశారు. తమిళ సంప్రదాయిక నృత్యాలుగా పేరుగడించిన మయిల్‌ఆట్టం, గరగాట్టం, ఒయిల్ ఆట్టం తదితర జానపద కళాకారుల ప్రదర్శనలు మోదీని ఆకట్టుకున్నాయి. భరత నాట్య కళాకారిణుల నాట్య ప్రదర్శనను కూడా మోదీ ఆసక్తిగా తిలకిస్తూ వెళ్లారు. ఇక కేరళ కళాకారుల చండీ మేళం ధ్వనులు కూడా రహదారి అంతటా మారుమోగాయి. మోదీ రోడ్‌షోను తిలకించేందుకు ఇరువైపులా నిలిచిన పార్టీ శ్రేణులు ఆయనపై బుట్టలకొద్దీ పూలను చల్లారు. దీనితో ఇరువైపు రహదారులపై ఆ పసుపు రంగు చేమంతి పూలు ప్రత్యేక కార్పెట్‌లా పరచుకున్నాయి. మోదీ చుట్టూ నిలిచిన బీజేపీ అభ్యర్థులు తమిళిసై సౌందరరాజన్, వినోజ్ పి సెల్వం, పాల్ కనకరాజ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా చేత తామరపుష్పాలను పట్టుకుని జనానికి అభివాదం చేస్తూ వెళ్లారు. వీరితోపాటు తిరువళ్లూరు అభ్యర్థి పొన్ బాలగణపతి, అరక్కోణం అభ్యర్థి కె.బాలు, కాంచీపురం అభ్యర్థి జ్యోతి వెంకటాచలం, టీఎంసీ అభ్యర్థి వీఎన్ వేణుగోపాల్ కూడా రోడ్‌షోలో పాల్గొన్నారు. మోదీ రోడ్‌షోను తిలకించేందుకు నగరంలో నివసిస్తున్న గుజరాతీలు వేల సంఖ్యలో విచ్చేశారు. ఇదే విధంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉత్తరాది కార్మికులు కూడా తరలి వచ్చారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ రోడ్‌షో నిర్దేశిత తేనాంపేట సిగ్నల్ వద్ద రాత్రి 7.15 గంటలకు విజయవంతంగా ముగిసింది. సుమారు 3500 పోలీసులు ఈ రోడ్‌షోలో భద్రతా విధులు నిర్వర్తించారు. రహదారికి ఇరువైపులా నిలిచి మోదీపై పూలు చల్లేందుకు బారికేడ్లను దాటుకునేందుకు ప్రయత్నించిన బీజేపీ, దాని మిత్ర పక్షాలకు చెందిన కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు శ్రమించాల్సివచ్చింది. ఇదిలా ఉండగా రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేసిన ప్రధాని.. బుధవారం ఉదయం వేలూరులో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు.

సమాచార ధ్వని

ముగిసిన టెన్త్ పబ్లిక్ పరీక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 9.25 లక్షల మంది హాజరుకాగా, సుమారు 17,000 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాల మూల్యాంకనం ఈనెల 12న ప్రారంభమై 22వ తేది వరకు జరగనుంది. అందుకోసం 88 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూల్యాంకన పనులు ముగిసి, మార్కుల జాబితా సిద్ధం చేసి, ఇదివరకే ప్రకటించిన విధంగా మే 10వ తేది ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

టెన్త్ విద్యార్థులకు వేసవి సెలవులు

అడయార్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో టెన్త్ విద్యార్థులకు వేసవి సెలవులు మంగళవారం నుంచి ప్రారంభ మయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లు, ప్రైవేటు పాఠశాలలకు ఈ సెలవులు ప్రారంభమయ్యాయి. స్టేట్ బోర్డు సిలబస్ కింద విద్యాభ్యాసం చేసే టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు నెల 26న ప్రారంభమై ఈ నెల 8వ తేదీతో ముగిశాయి. ఈ పరీక్షలకు సుమారుగా 9.10 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తమిళం, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్ పాఠ్యాంశాల్లో ఈ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. రెగ్యులర్ విద్యార్థులు మాత్రమే కాకుండా మరో 28,800 మంది ప్రైవేటు విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను రాశారు. ఈ పరీక్షలు సోమవారంతో ముగియడంతో మంగళవారం నుంచి ఈ విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చారు.

గ్రూప్-2ఏ పరీక్షా ఫలితాల విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: గ్రూప్-2ఏ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. 2, 2ఏ విభాగాల్లో ఇంటర్వ్యూ, ఇంటర్వ్యూ లేని పోస్టుల భర్తీకి గత ఏడాది రాతపరీక్ష జరిగాయి. గ్రూప్-2 ఇంటర్వ్యూ పోస్టుల ఫలితాలు గత జనవరిలో విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో, గ్రూప్-2ఏ పరీక్షా ఫలితాలు టీఎన్‌పీఎస్సీ తన వెబ్‌సైట్‌లో విడుదల చేసింది.

19న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 9: స్థానిక కోయంబేడు పండ్లు, పూల మార్కెట్‌కు ఈనెల 19న సెలవు ప్రకటించారు. ఈ మార్కెట్లో సుమారు 3,000 దుకాణాలుండగా 10,000 వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దుకాణ యజమానులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకొనేలా 19వ తేది మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు కోయంబేడు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు.

ఎగ్మూర్ - తిరునల్వేలి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 9: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై ఎగ్మూర్ - తిరునల్వేలి - చెన్నై ఎగ్మూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06070 తిరునల్వేలి - చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 11, 18, 25, మే 2, 9, 16, 23, 30 తేదీల్లో తిరునల్వేలిలో సాయంత్రం 6.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. అలాగే, నెం.06069 చెన్నై ఎగ్మూర్ - తిరునల్వేలి ప్రత్యేక రైలు ఈ నెల 12, 19, 26, మే 3, 10, 17, 24, 31 తేదీల్లో చెన్నై ఎగ్మూర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.10 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది.

● నెం.06043 చెన్నై సెంట్రల్ - కొచ్చువెల్లి ప్రత్యేక రైలు ఈ నెల 10, 17, 24 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.40 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది. అలాగే, నెం.06044 కొచ్చువెల్లి- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 11, 18, 25 తేదీల్లో కొచ్చువెల్లి నుంచి ఉదయం 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.40 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది.

నేటితో ముగియనున్న 'నీట్' దరఖాస్తు గడువు

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: నీట్ దరఖాస్తు సమర్పణ గడువు ఈనెల 10న బుధవారంతో ముగియనుంది. ప్లస్‌టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు వైద్యకోర్సుల్లో చేరేందుకు మే 5వ తేది నీట్ జరగనుంది. దరఖాస్తు సమర్పణ గడువు ఈనెల 4వ తేదీతో ముగిసింది. అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోకపోవడంతో వారి సౌకర్యార్థం మంగళ, బుధవారాల్లో దరఖాస్తు సమర్పణకు అవకాశం కల్పించారు. పరీక్షా ఫీజు బుధవారం రాత్రి 11.50 గంటల్లోగా చెల్లించాలని అధికారులు ప్రకటించారు.

గ్రూప్-1 ర్యాంక్ జాబితా విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: గ్రూప్-1 ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైన వారి ర్యాంకుల జాబితా విడుదలైంది. 95 ఖాళీ పోస్టుల భర్తీకి గత ఏడాది ఆగస్టు 10 నుంచి 13వ తేది వరకు రాతపరీక్ష జరిగింది. ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూ నిర్వహించారు. అందులో ఉత్తీర్ణులైన వారి జాబితాను సోమవారం విడుదల చేశారు. ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

మదురై మీనాక్షి దర్శనానికి రిజర్వేషన్లు ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: మదురై మీనాక్షి అమ్మవారి తిరుకల్యాణ దర్శనానికి రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఈనెల 12వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవ రోజుల్లో మీనాక్షి సమేత సుందరేశ్వర్ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 19వ తేది మీనాక్షి అమ్మవారి పట్టాభిషేకం, 20వ తేది దిగ్విజయం, 21న తిరుకల్యాణ వైభవం జరగనున్నాయి. ఈ కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు రూ.200, రూ.500 రుసుము నిర్ణయించారు. ఉచిత దర్శనానికి వచ్చే వారిని దక్షిణ గోపురం మీదుగా అనుమతించనున్నారు. టిక్కెట్ బుకింగ్ ఈ నెల 13వ తేది రాత్రి వరకు జరుగనుంది.

కొత్త రైళ్లు నడపండి

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: చెన్నై తాంబరం - రామేశ్వరం సహా 10 కొత్త రైళ్లు నడపాలని రైల్వే బోర్డుకు దక్షిణ రైల్వే సిఫారసు చేసింది. దక్షిణ రైల్వేలో చేపడుతున్న జంట రైలుమార్గం, బ్రాడ్ గేజీ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గాల్లో అధికారుల ట్రయల్ రన్ నిర్వహించి నివేదిక తయారు చేశారు. త్వరలో తాంబరం - రామేశ్వరం, కోయంబత్తూర్ - తాంబరం సహా వివిధ మార్గాల్లో 19 కొత్త రైళ్లు నడపాలని రైల్వే బోర్డును దక్షిణ రైల్వే కోరింది.

రైళ్ల వేగం తగ్గింపు

ఐసిఎఫ్, ఏప్రిల్ 9: మాధవరం - సిరుచేరి సిప్కాట్ మెట్రోరైలు సొరంగం తవ్వే పనుల కోసం ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం తగ్గించినట్లు అధికారులు తెలిపారు. నగరంలో రెండవ విడత మెట్రోరైలు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాధవరం - సిరుచేరి సిప్కాట్ వరకు 45.4 కి.మీ దూరం మూడో మార్గం ఏర్పాటుకానుంది. పెరంబూర్ రైలుపట్టాలకు అడుగున మెట్రో సొరంగం తవ్వే పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ మార్గంలో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగాన్ని ఆరు రోజులు తగ్గించి నడపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.



ఉగాది వేడుకల్లో ఆస్కా నిర్వాహకులు - హాజరైన తెలుగు ప్రముఖులు

ఆస్కాలో ఘనంగా ఉగాది వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా)లో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు తెలుగు ప్రముఖులు భారీగా తరలివచ్చారు. వేడుకల్లో భాగంగా వేదపండితులు ప్రసాద్, కృష్ణ పంచాంగ పఠనం గావించారు. పూజాది కార్యక్రమాల అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ... ప్రజలందరికీ ఇప్పటి వరకూ వున్న ఆటంకాలన్నీ తొలగిపోయి క్రోధి నామ సంవత్సరంలో అందరూ సంతోషంగా వుండాలని ఆకాంక్షించారు. నిజానికి ఉగాది సందర్భంగా పలువురు న్యాయమూర్తులను సన్మానించాల్సివుందని, కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ కార్యక్రమం వాయిదా పడిందన్నారు. ఈ నెల 13న తమిళ ఉగాది వేడుకలు, 17న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తామన్నారు. త్వరలో ఫుడ్‌ఫెస్టివల్స్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆస్కా సభ్యులు కూడా పాల్గొన్నారు. ఇదిలా వుండగా ప్రస్తుతం ఆస్కా రెస్టారెంట్‌ను యాజమాన్యమే నిర్వహిస్తోంది. గతంలో కంటే ఆహార పదార్థాల నాణ్యత, రూఫ్ గార్డెన్‌పై సేవలు బాగున్నాయంటూ పలువురు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

పులల్ కావాంగరై తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా ఉగాది వేడుకలు

ప్యారీస్, ఏప్రిల్ 9: స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్ కావాంగరై తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. పుళల్ ప్రాంతంలో సుమారు 1,200 ఏళ్లనాటి పురాతన స్వర్ణాంబిక సమేత తిరుమూలనాథర్ స్వామి దేవస్థానంలో ఉదయం 7.30 గంటలకు స్వామివారికి పాలు, పెరుగు, పన్నీరు, నారీకేళ జలం, గంధం, సుగంధ ద్రవ్యాలతో మహా అభిషేకం సహా ప్రత్యేక అలంకారం, దీపారాధన నిర్వహించారు. అనంతరం షడ్రుచుల ఉగాది భక్తులకు పంపిణీ చేశారు. పంచాంగ పఠనం అనంతరం ఉగాది విశిష్టతను వేదపండితులు వివరించారు. ఈ వేడులకు ముఖ్య అతిథిగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, విశిష్ట అతిథులుగా తమిళ



ఉగాది వేడుకల్లో ఆచార్య సీఎంకే రెడ్డి, తాళ్లూరి సురేష్, వీజీ జయకుమార్ తదితరులు

నాడు కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లయన్ తాళ్లూరి సురేష్, తమిళనాడు కమ్మ నాయుడు సంఘ అధ్యక్షుడు లయన్ ఏజీ జయకుమార్, లయన్ ఏవీ శివకుమారి, డాక్టర్ నాగభూషణం, సాయి చాక్లెట్ వరల్డ్ సీఈఓ గుండా గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెగా అన్నదానం జరిగింది.

డ్రోన్ ద్వారా అత్యవసర మందులు



పెరంబూర్, ఏప్రిల్ 9: స్థానిక చెంగల్పట్టులోని సెంట్రల్ లెప్రసీ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా అత్యసర చికిత్సకు అవసరమైన మందులు ఆసుపత్రులకు తరలించే ట్రయల్ రన్ సోమవారం జరిగింది. జిల్లాలోని లెప్రసీ ఆసుపత్రులకు అత్యవసర మందులు, రక్తపరీక్షల నమూనాలు డ్రోన్ ద్వారా సత్వరం అందించాలని ఈ రీసెర్చి సెంటర్ నిర్ణయించింది. అందుకోసం అత్యవసర మందులు తరలించేలా డ్రోన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సెంటర్ నుంచి నందివరం - గూడువాంజేరి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందులను ఈ డ్రోన్ ద్వారా తరలించారు. నాలుగు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవు కలిగి ఏడున్నర కిలోల బరువున్న ఈ డ్రోన్ గరిష్ఠగా 50 కిలోల బరువు మోసే సామర్థ్యం కలిగి ఉంది. సోమవారం చేపట్టిన ట్రయన్ రన్‌లో చెంగల్పట్టు కొల్వాయ్ సరస్సు నుంచి బయల్దేరి 200 అడుగుల రోడ్డు మీదుగా 25 నిమిషాల్లో నందివరం ప్రభుత్వాసుపత్రికి డ్రోన్ చేరుకుందని అధికారులు తెలిపారు.

దేవాదాయ శాఖ ఆధీనంలోకి తిరునీలకంఠేశ్వరాలయం

పెరంబూర్, ఏప్రిల్ 9: స్థానిక పల్లావరం పెరుమాళ్‌నగర్‌లో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని పల్లవులు నిర్మించినట్లు చెబుతుంటారు. ఆలయ పారంపర్య ట్రస్టీగా ఉన్న దురైస్వామి మృతి అనంతరం పలువురు ప్రైవేటు వ్యక్తులు ఈ ఆలయ నిర్వహణ చేపట్టారు. వీరు ఆలయానికి సొంతమైన భూములను చట్టవిరుద్ధంగా విక్రయించినట్లు దేవాదాయ శాఖకు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై స్పందించిన దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం ఆలయానికి చేరుకొని, ఈ ఆలయం హిందూ దేవదాయ శాఖ ఆధీనంలో ఉందని బోర్డు ఏర్పాటు చేశారు. విక్రయానికి గురైన ఆలయ భూములపై విచారణ చేపట్టి వాటిని స్వాధీనం చేసుకొనేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

చిరుత జాడ కోసం 7వ రోజూ కొనసాగిన గాలింపు

పెరంబూర్, ఏప్రిల్ 9: మైలాడుదురై పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుత కోసం ఏడో రోజైన మంగళవారం గాలింపు చర్యలు కొనసాగాయి. అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని చిరుతను బంధించేందుకు 10 ప్రాంతాల్లో బోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షించారు. కానీ, చిరుత ఆ ప్రాంతం నుంచి 22 కి.మీ దూరంలోని కుత్తాలం సమీపం కాంజివాయ్‌లో సంచరిస్తోందనే ఆ ప్రాంత ప్రజల సమాచారం మేరకు అటవీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో తంజావూరు జిల్లా తిరువిడైమురుదూర్ తాలూకా నరసింగంపేటలో చిరుత కనిపించిందనే సమాచారంతో అటవీ బృందాలు అక్కడికీ చేరుకొని మూడు ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటుచేశారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారి అభిషేక్ తోమర్ మాట్లాడుతూ.. సిబ్బంది సాయంతో చిరుత కోసం గాలిస్తున్నామని తెలిపారు.



వేలూరు జిల్లా గుడియాత్తంలో ఉన్న ఇస్లామియా కళాశాలలో మంగళవారం 100 శాతం ఓటింగ్‌పై చేపట్టిన అవగాహన ప్రచారంలో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వేలూరు టీటీడీ ఆలయంలో ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

వేలూరు, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం టీటీడీ స్థానిక సమాచార కేంద్రంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక అలంకారం, వెండి కవచం ధరింపజేసి దీపారాధనలు నిర్వహించారు. భక్తులు వరుసలో నిలబడి శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధి ముందు పండ్లు, పూలు, రంగులతో రంగవల్లికలు తీర్చిదిద్దారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

రాష్ట్ర జాలర్లపై లంక నావికాదళం దాడి

పెరంబూర్, ఏప్రిల్ 9: రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడింది. రామేశ్వరం నుంచి ఆదివారం 100 ఫైబర్ పడవల్లో సుమారు 1,500 జాలర్లు చేపల వేటకు వెళ్లారు. కచ్చాదీవి సమీపంలో సోమవారం రాత్రి చేపలు వేటసాగిస్తున్న జాలర్లను చుట్టుముట్టిన లంక నావికాదళం కత్తులు, ఇనుప రాడ్లతో జాలర్లపై దాడి చేశారు. అలాగే, జాలర్ల వలలను కూడా ధ్వంసం చేశారు. వారి దాడులకు భయపడిన జాలర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తీరానికి చేరుకున్నారు. దాడిలో గాయపడిన నలుగురు జాలర్లను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ దాడిపై జాలర్ల సంఘాలు మత్స్యశాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ విభాగాలకు ఫిర్యాదు చేశారు.

లేడీ కానిస్టేబుల్‌తో డీఎస్పీ రహస్య కాపురం

● బంధువుల ఫిర్యాదుతో గుట్టురట్టు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో ఓ అద్దె ఇంట్లో రహస్యంగా కాపురం చేస్తున్న ఓ లేడీ కానిస్టేబుల్, డీఎస్పీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగపట్టినం జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీకి, తిరుచ్చి జిల్లాల్లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త సహజీవనానికి దారితీసింది. విషయం తెలుసుకున్న మహిళా కానిస్టేబుల్ బంధువులు తిరుచ్చి సుబ్రమణ్యపురంలో వారు నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఇద్దరు ఉన్నట్లు నిర్ధారించుకున్న బంధువులు తలుపులకు తాళం వేశారు. ఆ తర్వాత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన ఆ ఇంటికి వెళ్లి లేడీ కానిస్టేబుల్‌ను వెలుపలికి పిలిచారు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆ తర్వాత పోలీసులు ఆమెను సర్దిపుచ్చి వెలుపలికి రప్పించారు. ఆమె వెనుకే డీఎస్పీ కూడా వచ్చి పోలీసులును చూసి ఆగ్రహంతో ఊగిపోయారు. తాను సెలవులో ఉన్నానని, తన వ్యక్తిగత వ్యవహారంలో ఎలా జోక్యం చేసుకుంటారని మండిపడ్డారు. లేడీ కానిస్టేబుల్ బంధువులు ఫిర్యాదు చేయడం వల్లే విచారణ జరపడానికి వచ్చామని పోలీసులు బదులిచ్చారు. ఆ తర్వాత ఇద్దరినీ విచారించారు. పరస్పర అంగీకారంతోనే సహజీవనం చేస్తున్నట్టు వెల్లడైంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

కన్నియాకుమారిలో వెనక్కి మళ్లిన సముద్రం

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో మంగళవారం ఉదయం సముద్రం వెనక్కి మళ్లింది. అదే సమయంలో తీరం నుంచి వివేకానంద స్మారక మండపం ప్రాంతానికి నడుపుతున్న బోట్ సవారీ సేవలను పూంపుహార్ షిప్పింగ్ సంస్థ రద్దు చేయడంతో పర్యాటకులు నిరాశ చెందారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో త్రివేణి సంగమ ప్రాంతం సంగిలితురై తీరం వద్ద సుమారు 50 అడుగుల దూరం వరకూ సముద్రం వెనక్కి మళ్లింది. దీనితో నాచుతో కూడిన బండరాళ్లు, ఇసుక తిన్నెలు బయల్పడ్డాయి. సముద్రం ఇలా వెనక్కి మళ్లటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేయకుండా తిరిగి వెళ్ళిపోయారు.



తిరుమలేశుడి సేవలో సంతానం

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం తమిళ సినీ నటుడు సంతానం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

● డీఎంకే ప్రభుత్వంపై ఎడప్పాడి ధ్వజం

ప్యారీస్, ఏప్రిల్ 9: ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం నెరవేర్చకుండా మొండిచెయ్యి చూపిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. మదురై లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారం నిమి త్తం వెళ్లిన పళనిస్వామికి మంగళవారం ఉదయం పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మాజీ మంత్రులు సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్ తదితర నేతలతో కలసి మదురై సెంట్రల్ కూరగాయల మార్కెట్లో పళనిస్వామి కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారుల వద్ద కూరగాయల ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారంలో ఉన్నా, లేకున్నా అన్నాడీఎంకే ఒకే లక్ష్యంతో పని చేసిందన్నారు. గత పదేళ్ల పాలతో ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో పథకాలను అమలు చేశామని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా డీఏను పెంచడంతో పాటు ఉద్యోగ విరమణ పొందే వారికి ఏ మాత్రం ఆలస్యం లేకుండా వారికి అందాల్సిన ప్రయోజనాలను అందజేశామన్నారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా ఆచరణకు నోచుకోలేదన్నారు.లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఓట్ల కోసం సీఎం స్టాలిన్ మళ్లీ అబద్ధాలు వల్లిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, నేత కార్మికులను నమ్మించే ప్రయత్నాల్లో దిగారన్నారు. ఉదాహరణకు, చెన్నైలో వాననీటి సంరక్షణ పథకం పనులు 99 శాతం పూర్తయ్యాయని డీఎంకే ప్రభుత్వం చెప్పిందని అయితే, జలదిగ్బంధంలో నగరం చిక్కుకొని ప్రజలు ఇబ్బందులు పాలైన సమయంలో సంబంధిత మంత్రి ఆ పనులు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయని చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. మరోవైపు బీజేపీ నాయకులు అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, మాజీ సీఎం జయను పొగడ్తలతో ముంచెత్తుతున్నారని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికస్థానాలు కైవసం చేసుకుంటుందని, అలాగే విలవంగోడు ఉపఎన్నికలో విజయం సాధించి రికార్డు సృష్టిస్తుందని పేర్కొన్నారు.



వ్యాపారులను ఓట్లు అభ్యర్థిస్తున్న పళనిస్వామి

బీజేపీని గద్దె దించడమే ఏకైక లక్ష్యం

తోల్ తిరుమావళవన్ ● వీసీకే ఎన్నికల మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న తిరువావళవన్

అడయార్, ఏప్రిల్ 9: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని గద్దె దించడమే తమ ఏకైక లక్ష్యమని వీసీకే ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ శపథం చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన మంగళవారం కడలూరు జిల్లా చిదంబరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దెదించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఇండియా కూటమిలో కీలక నేతగా స్టాలిన్ చెలామణి అవుతారన్నారు. బీజేపీని గద్దె దించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. తమ కూటమి అధికారంలోకి వస్తే, వంద రోజుల ఉపాధి హామీ పథకం కింద పని రోజులను 200కు పెంచుతామన్నారు. జీఎస్టీ విధానం రద్దు చేస్తామన్నారు. కేంద్రంలో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. విశ్వవిద్యాలయాలకు చాన్స్‌లర్‌గా గవర్నర్ నియామకం ఉండరాదన్నారు. అంబేద్కర్ రచనలను అన్ని భాషల్లో ముద్రింస్తామన్నారు. అంబేద్కర్ జయంతి రోజును నాలెడ్జ్ డేగా ప్రకటిస్తామన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. ఎన్నికల కమిషనర్ నియామక చట్టాన్ని రద్దు చేయిస్తామన్నారు.

తిరుమా ఇంట్లో ఐటీ సోదాలు...

డీపీఐ అధ్యక్షుడు, చిదంబరం లోక్‌సభ అభ్యర్థి తిరుమావళవన్ ఇంట్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. చిదంబరం బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న అద్దెఇంట్లో మంగళవారం రాత్రి హఠాత్తుగా వచ్చిన అధికారులు తనిఖీలు చేపట్టారు.

బీజేపీ నాయకుడి ఇంట్లో పోలీసుల సోదాలు

● విల్లివాక్కంలో కలకలం

అడయార్, ఏప్రిల్ 9: అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ అగ్రిమెంట్ పత్రాలను సృష్టించిన కేసులో నగరానికి చెందిన బీజేపీ నాయకుడు మీనాక్షి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇంటి యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అలాగే, నకిలీ పత్రాలు తయారీకి సహకరించిన విల్లివాక్కం బీజేపీ విభాగ నేత ముత్తుపాండ్యన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో విల్లివాక్కంలోని ఆయన నివాసంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిరుమంగళం ప్రాంతానికి చెందిన శోభన (55) కు చెందిన ఇంట్లో మీనాక్షి అద్దెకుంటున్నారు. అయితే, శోభన సంతకం చేసినట్టుగా నకిలీ పత్రాలను సృష్టించి ఇంట్లోనే బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శోభన... పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి, నకిలీ పత్రాల తయారీ కేసులో మీనాక్షిని అరెస్టు చేయగా, ఆయనకు సహకరించిన బీజేపీ ప్రముఖుడు ముత్తుపాండ్యన్ కోసం గాలిస్తున్నారు.

డీఎంకే ఆఫీసులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరులోని డీఎంకే కార్యాలయంలో మంగళవారం ఉదయం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. స్క్వాడ్‌కు చెందిన ముగ్గురు అధికారులు కార్యాలయంలోకి వెళ్ళి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రెండు గంటలపాటు ఈ సోదాలు కొనసాగాయి. ఆ తనిఖీల్లో ఎలాంటి నగదు పట్టుబడలేదు.

నయినార్ నాగేంద్రన్ ప్రచార వాహనం తనిఖీ

పెరంబూర్, ఏప్రిల్ 9: తిరునల్వేలి లోక్‌సభ నియోకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ కారు, ప్రచార వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఆయన మంగళవారం కడయం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో, అంబై సమీపంలో వాహనతనిఖీలు చేపట్టిన ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు, నయినార్ నాగేంద్రన్ వాహనాలను తనిఖీ చేశారు. ప్రచారాన్ని అధికారులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

ఇద్దరు పారిశ్రామికవేత్తల ఇళ్లలో ఐటీ తనిఖీలు

ప్యారీస్, ఏప్రిల్ 9: ఉత్తర చెన్నైలోని వాషర్‌మెన్‌పేటలో ఉన్న ఇద్దరు పారిశ్రామికవేత్తల ఇళ్లలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాషర్‌మెన్‌పేటలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సంజయ్‌బోథర్... ఎంసీ రోడ్డులో వస్త్ర దుకాణం నడుపుతున్నారు. అదే ప్రాంతంలోని మరో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సునీల్ అనే పారిశ్రామికవేత్త ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టిన అధికారులు, పలు దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మోదీ - షా ద్వయాన్ని చూస్తేనే ఎడప్పాడికి వణుకు


● కనిమొళి

అడయార్, ఏప్రిల్ 9: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ద్వయాన్ని చూస్తేనే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి గజగజ వణికిపోతారని డీఎంకే మహిళా నేత, తూత్తుక్కుడి డీఎంకే లోక్‌సభ అభ్యర్థి కనిమొళి అన్నారు. సోమవారం రాత్రి కొళత్తూరులో జరిగిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగిస్తూ, ఇపుడు జరిగేవి లోక్‌సభ ఎన్నికలు మాత్రమే.. కానీ, ఇవి అసెంబ్లీ ఎన్నికలుగా భావించి ఎడప్పాడి కె.పళనిస్వామి తమను లక్ష్యంగా చేసుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఆయన ఆరోపణలకు తాము దీటుగానే కౌంటర్ ఇస్తున్నామన్నారు. ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కొళత్తూరు అసెంబ్లీ అభివృద్ధికి ఏం చేయలేదని ఎడప్పాడి పదేపదే ఆరోపిస్తున్నారు. నిజానికి సీఎం హోదాలో స్టాలిన్ ఈ నియోజకవర్గానికి మూడుసార్లు వచ్చారని పేర్కొన్నారు. ఇప్పటివరకు మోదీ, అమిత్‌షాను ఏ సభలో అయినా ఎడప్పాడి విమర్శించారా అని ఆమె ప్రశ్నించారు.

రూ.30 లక్షల నగదు స్వాధీనం

అడయార్, ఏప్రిల్ 9: తగిన ఆధారాలు లేకుండా ఏపీ నుంచి చెన్నైకి తీసుకొచ్చిన రూ.30 లక్షల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో ఈ నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి చెన్నై సెంట్రల్‌కు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఈ రైలులో వచ్చిన ప్రయాణికుల్లో అనుమానాస్పదంగా ఉన్న వారి లగేజీలను ఆర్పీఎఫ్‌తో కలిసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒక ప్రయాణికుడి లగేజీలో నోట్ల కట్టలను గురించారు. ఈ నగదుకు తరలింపునకు సంబంధించి తగిన ఆధారాలు చూపించాలని కోరగా, ఎలాంటి పత్రాలు లేవని ప్రయాణికుడు చెప్పాడు. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బు తీసుకొచ్చిన ప్రయాణికుడిని ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన జ్ఞానవేల్ తంగవేల్ (42)గా గుర్తించారు. ఆ తర్వాత ఈ డబ్బును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

పోలీసు పహారాలో కోట మైదానం



వేలూరు, ఏప్రిల్ 9: స్థానిక కోట మైదానంలో బుధవారం జరిగే ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్య ర్థి ఏసీ షణ్ముగంకు మద్దతుగా ప్రధాని ప్రచారం చేయనున్నారు. ప్రధాని రాకను పురస్కరించుకొని నగరవ్యాప్తంగా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మైదానంలో చేపట్టిన భద్రతా చర్యలను మంగళవారం ఎస్పీ మణివణ్ణన్ పరిశీలించారు. ప్రధాని భద్రతా చర్యల్లో 3,290 మంది పోలీసులు పాల్గొంటున్నట్టు జిల్లా పోలీసు శాఖ తెలిపింది.



వేలూరు లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ మంగళవారం గుడియాత్తంలో ప్రచారం చేపట్టి బీడీ కార్మికుడికి సాయం చేస్తున్న దృశ్యం

● వీఐపీ నియోజకవర్గం

తూత్తుకుడి.. చతుర్ముఖ పోటీ



డీఎంకే అభ్యర్థి కనిమొళి, టీఎంసీ అభ్యర్థి విజయశీలన్, అన్నాడీఎంకే అభ్యర్థి శివసామి వేలుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి రెవినా రూత్‌జెన్

● చిత్తయ్యేదెవరో?

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గంలో పేరుకు చతుర్ముఖ పోటీయే అయినా ప్రధానంగా పాలకపక్షం డీఎంకే, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ నెలకొంది. ఈ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరి, డీఎంకే మహిళా విభాగ నాయకురాలు కనిమొళి రెండో సారి బరిలో నిలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి శివసామి వేలుమణి ఆమెకు గట్టిపోటీ ఇస్తున్నారు. టీఎంసీ, ఎన్టీకే అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

అభివృద్ధి... ఆధ్యాత్మికం

తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గం పారిశ్రామిక నగరంగా, రాష్ట్రంలో రెండో ఓడరేవుగా విరాజిల్లుతోంది. రోడ్డు, రైలు, విమాన, సముద్రయాన మార్గాలు కలిగిన నగరంగాను పేరుగడించింది. ఇక స్వాతంత్ర్య సమరయోధులు జన్మించిన ప్రాంతం గా, నవ తిరుపతి, నవకైలాసం, తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామిఆలయం, తూత్తుకుడి పనిమయమాత ఆలయం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు కలిగిన నగరంగా ప్రసిద్ధి చెందింది.

72 శాతం మంది హిందువులు...

ఈ నియోజకవర్గంలో హిందువులు సుమారు 72 శాతం, క్రైస్తవులు 21 శాతం, ముస్లింలు 7 శాతం ఉన్నారు. నాడార్ కులస్థులు, ఎస్సీలు, బీసీలు కూడా ఉన్నారు. ఒట్టపిడారం, విలాత్తికుళం, కోవిల్‌పట్టి శాసన సభ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించే స్థాయిలో నాయుడు కులస్తులు ఉన్నారు. ప్రస్తుతం ఇండియా కూటమి తరఫున డీఎంకే అభ్యర్థిగా రెండో సారి తలపడుతున్న కనిమొళికి అన్నాడీఎంకే అభ్యర్థిగా ఆర్. శివసామివేలుమణి, ఎన్డీయే కూటమి తరఫున టీఎంసీ అభ్యర్థిగా ఎస్డీఆర్ విజయశీలన్, ఎన్టీకే తరఫున రెవినా రూత్ జేన్ గట్టి పోటీ ఇస్తున్నారు. గత ఏడాది వరదల సమయంలో తూత్తుకుడిలోనే రోజుల తరబడి మకాంపెట్టి బాధితులను ఆదుకున్న కనిమొళి సేవలను నియోజకవర్గం ప్రజలు ప్రశంసిస్తుండటం ఈ ఎన్నికల్లో ఆమెకు ప్లస్‌పాయింట్. కనిమొళికి మద్దతుగా మంత్రులు అనితా రాధాకృష్ణన్, గీతా జీవన్, మేయర్ జగన్ పెరియసామి నియోజకవర్గం నలుమూలలా ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. అన్నాడీఎంకే అభ్యర్థి ఆర్ శివసామి వేలుమణి తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం తాలూకాలోని మంగళపురానికి చెందినవారు. తూత్తుకుడి జిల్లాలో గత ఏడాది సంభవించిన వరదల సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిని బాధిత ప్రాంతాల్లో పర్యటింపజేసి, బాధితులకు సహాయాలను పంపిణీ చేయించి ఆయన మంచి పేరు సంపాదించుకున్నారు. టీఎంసీ అభ్యర్థి ఎస్డీఆర్ విజయశీలన్ తొలిసారిగా బరిలో ఉన్నారు. అభ్యర్థిగా కొత్తే అయినా విజయశీలన్ స్థానికుడు కావడం ప్లస్ అవుతోంది.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రధాని మోదీ ఐదుసార్లు పర్యటించి పార్టీ సభల్లో పాల్గొని ప్రసంగించడం,బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిర్వహించిన ఎన్ మణ్ ఎన్ మక్కల్ పాదయాత్ర వంటి అంశాలు తన విజయానికి దోహదం చేస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి రెవినా రూత్‌జెన్ దంతవైద్యురాలు. నియోజకవర్గంలో ఈమెకు కూడా ప్రజలతో సత్సంబంధాలు అధికంగానే ఉన్నాయి. ఇలా నాలుగు పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నా, ప్రధాన పోటీ డీఎంకే, అన్నాడీఎంకే మధ్యేనని చెప్పవచ్చు.

స్టార్ హోదా...

తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో తూత్తుకుడి, తిరుచెందూరు, శ్రీవైకుంఠం, ఒట్టపిడారం, విలాత్తికుళం, కోవిల్‌పట్టి శాసనసభనియోజకవర్గాలు ఉన్నాయి. గత 2009 ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి ఎస్ఆర్ జబదురై అన్నాడీఎంకే అభ్యర్థి సింధియా పాండ్యన్ కంటే 76,649 ఓట్లు ఆధిక్యతను సాధించారు. 2014లో అన్నాడీఎంకే అభ్యర్థి జయసింగ్ త్యాగరాజ్ నట్టర్జీ తన సమీప డీఎంకే ప్రత్యర్థి జగన్ పెరియసామి కంటే లక్షా 24 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 2019లో అన్నాడీఎంకే కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి కుమార్తె కనిమొళి బరిలోకి దిగటంతో ఈ నియోజకవర్గానికి ఉన్నట్టుండి స్టార్ హోదా లభించింది. ఆ ఎన్నికల్లో తమిళిసై సౌందరరాజన్ కంటే 3,47,209 ఓట్ల మెజారిటీ సాధించి కనిమొళి ఘనవిజయం సాధించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి మధ్యే గట్టి పోటీ నెలకొంది. ఆ ద్విముఖపోటీలో సులువుగా గెలిచిన కనిమొళి ఈ సారి మూడు పార్టీల ఓట్ల చీలిక వల్ల మరింత సునాయాసంగా విజయం సాధించగలననే ధీమాతో ఉన్నారు.

మహిళా ఓటర్లే అధికం...

ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో కనిమొళి గెలుపు తథ్యమని మంత్రి అనితా రాధాకృష్ణన్ చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో 7,13,388 మంది పురుషులు, 7,44,826 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 218 మంది హిజ్రాలను కలుపుకుంటే మొత్తం ఓటర్లు 14,58,430 దాకా ఉన్నారు.

ప్రధాన సమస్యలు..

తూత్తుకుడి నుంచి ఇతర నగరాలకు రైలు సేవలు పెంచాలని, తూత్తుకుడి - విలాత్తికుళం మీదుగా మదురైకి రైలు మార్గం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, పర్యావరణానికి హాని కలిగించని పరిశ్రములు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని, తూత్తుకుడి కార్పొరేసన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఒకటో నెంబర్ రైల్వేగేట్, రెండో నెంబర్ రైల్వేగేట్ ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి సమీపంలోని వీవీడీ జంక్షన్ వద్ద ట్రాఫికి రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇక కోవిల్‌పట్టిని కొత్త జిల్లాగా ప్రకటించాని, అగ్గిపెట్టెల పరిశ్రమలకు సంబంధించిన వ ఎండి పదార్థాలను సిడ్కో ద్వారా అందించాలని, అదే విధంగా ఆ ప్రాంతంలో బస్‌స్టేషన్ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఎట్టయపురంలోని ఫోర్‌వేలో ఫ్లైఓవర్లు నిర్మించాలని, విలాత్తికుళంలో కొత్త పరిశ్రమలు స్థాపించాలని, పంబై - అచ్చన్‌కోవిల్ - వైప్పారు అనుసంధాన పథకాన్ని అమలు చేయాలని ఈ నియోజకవర్గం ఓటర్లు యేళ్లతరబడి డిమాండ్ చేస్తున్నారు. స్థానికుల కోరికలను నెరవేరుస్తామని ఇటు పాలకపక్షం డీఎంకే అభ్యర్థి కనిమొళి, అటు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అభ్యర్థి శివసామి వేలుమణి భరోసా ఇస్తున్నారు. ఎన్నికలకు ఇక తొమ్మిది రోజుల గడువే ఉండటంతో ఈ రెండు పార్టీల ప్రచారం తారస్థాయికి చేరుకుంది.

● ప్రచారంలో పాట్లు



తిరుప్పూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మురుగానందం మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చెరుకు రసం తీస్తున్న దృశ్యం



తేని లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి తంగ తమిళ్‌సెల్వన్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై బెల్లం పాకం కలుపుతున్న దృశ్యం



శ్రీపెరుంబుదూర్ డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా మోటర్ సైకిల్‌పై ప్రచారంలో పాల్గొన్న ఆయన కుమారుడు, మంత్రి టీఆర్బీ రాజా



● 'ఎన్ని'కల పాట్లు



టీ తాగుతున్న కేంద్ర మంత్రి మురుగన్

డీఎంకే కార్యకర్త టీషాపులో మురుగన్

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ అన్నూరు వద్ద ప్రచారం చేస్తూ డీఎంకే కార్యకర్త పళనిస్వామి నడుపుతున్న టీ షాపులో తేనీరు సేవించారు. నియోజకవర్గవ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్న మురుగన్‌ను పళనిస్వామి కలుసుకుని తన దుకాణంలో టీ తాగమంటూ ఆహ్వానించాడు. ఆయన కోరిక మేరకు అన్నూరు వద్ద ప్రచారం చేస్తూ టీషాపుకు వెళ్లారు. పళనిస్వామి వెంటనే ఆయనకు చక్కటి టీ అందించారు. షాపులో బల్లపై కూర్చుని టీ తాగిన మురుగన్... చాలా బాగుందని కితాబిచ్చారు. ఆ టీకి డబ్బులు చెల్లించి అక్కడే గుమికూడిన ప్రజలను కలుసుకుని తామర గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలంటూ ప్రచారం చేశారు.

● అప్పనంగా... ఆపద

చిలుక జోస్యుడి అరెస్టు

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కడలూరు పీఎంకే అభ్యర్థి, ప్రముఖ తమిళ సినీ దర్శకుడు తంగర్‌బచ్చన్‌కు నాలుగు మంచి మాటలు చెప్పిన చిలుక జోస్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం మధ్యాహ్నం తంగర్‌బచ్చన్ ఓట్ల వేట సాగిస్తూ ఓ చెట్టు నీడన సేద తీరారు. ఆ సమయంలో ఆ చెట్టు కిందే ఉన్న చిలుక జోస్యుడిని గమనించి తనకు జోస్యం చెప్పమని అడిగారు. ఆ చిలుక జోస్యుడు బోనులో ఉన్న చిలుకను బయటకు రప్పించి అయ్యనార్ చిత్రపటం కలిగిన చిట్టాను చూపారు. అయ్యనార్ పటం రావటంతో ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తారంటూ తంగర్‌బచ్చన్‌కు తెలిపారు. ఆ మాటలకు సంతోషించిన తంగర్‌బచ్చన్ ఆ చిలుక జోస్యుడికి చిల్లర ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ తర్వాత తంగర్‌బచ్చన్ చిలుక జోస్యం చూస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఆ చిలుక జోస్యుడిని అరెస్టు చేశారు. చిలుకను బోనులో నిర్బంధించడం నేరమని చెబుతూ ఆ జోస్యుడి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్న మరో ఇద్దరు చిలుక జోస్యులను కూడా అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా తమ పార్టీ అభ్యర్థి తంగర్‌బచ్చన్‌కు జోస్యం చెప్పిన చిలుక జోస్యుడిని అరెస్టు చేయడం డీఎంకే ప్రభుత్వ కక్ష సాధింపు చర్యేనని పీఎంకే నాయకుడు అన్బుమణి రాందాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



చిలుకజోస్యం చూస్తున్న తంగర్‌బచ్చన్

పోలీసుస్టేషన్ ఎదుట మన్సూర్ అలీఖాన్ ధర్నా

● సింగిల్‌గా నిరసన

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమిళ సినీ విలన్ నటుడు మన్సూర్ అలీ ఖాన్ మంగళవారం ఉదయం సత్తువాచేరి పోలీసులు స్టేషన్ ఎదుట ధర్నా జరిపారు. తనతోపాటు ప్రచారం చేస్తున్న అనుచరుడిపై స్థానిక బీజేపీ నాయకుడు దాడి జరిపాడని ఆరోపిస్తూ మన్సూర్ అలీఖాన్ ఇటీవల సత్తువాచేరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తన ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదంటూ ఆయన సత్తువాచేరి పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆయన్ను సర్ది చెప్పి పంపించారు.



సత్తువాచేరి పోలీసుస్టేషన్ వద్ద ధర్నాలో సినీనటుడు మన్సూర్ అలీఖాన్

ఓటు హక్కు వినియోగించుకోండి

● క్రికెట్ మైదానం వద్ద ఎన్నికల అధికారి ప్రచారం

● వందశాతం ఓటింగ్ కోసం...

పెరంబూర్, ఏప్రిల్ 9: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ విజ్ఞప్తి చేశారు. చెపాక్ క్రికెట్ మైదానంలో సోమవారం రాత్రి ఐపీఎల్ పోటీల్లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్- కోల్‌కత్తా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌కు వేలసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కాగా, ఈనెల 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా ఎన్నికల కమిషన్ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారాలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం స్టేడియం వద్దకు చేరుకున్న ఎన్నికల అధికారి రాధాకృష్ణన్, స్టేడియానికి వస్తున్న అభిమానులకు కరపత్రాలు అందజేస్తూ, తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రచారం చేశారు.



చెపాక్ క్రికెట్ స్టేడియం వద్ద యువకులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాధాకృష్ణన్

ఆ రోలెక్స్ వాచ్ బిల్లు ఎక్కడుందో చెబుతారా?

● దయానిధికి వినోజ్ పి.సెల్వం సూటి ప్రశ్న

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తనకు కేవలం లక్షన్నర రూపాయల కారు మాత్రమే ఉందని చెబుతున్న దయానిధి.. మరి చేతికి రూ.45 లక్షల విలువైన రోలెక్స్ వాచీ ఎలా ధరిస్తున్నారో చెప్పాలని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ప్రశ్నించారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రధానమంత్రి మోదీ రోడ్‌షోకు ముందే ఇంటింటి ప్రచారం చేపట్టిన వినోజ్ మీడియాతో మాట్లాడుతూ.. దయానిధి మారన్ నిరుపేద అని, ఆయన వద్ద కేవలం లక్షన్నర రూపాయల విలువైన కారు మాత్రమే వుందని ఎద్దేవా చేశారు. మరి అంత ఖరీదైన వాచ్చీ ఎలా వచ్చిందో, దాని రశీదు ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. ఆయన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న ఆస్తుల వివరాలను బయటకు తీయబోతున్నామన్నారు. ఏనాడూ నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోని దయానిధి.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్నారో చెప్పాలన్నారు. ఎంతోమందికి గృహాల్లేవని, మంచినీరు కూడా దొరకడం లేదన్నారు. మరి ఇన్నాళ్లుగా నియోజకవర్గానికి దయానిధి ఏం చేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని రంగాల్లోనూ విఫలమైందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని విమర్శించారు.



ప్రచారంలో వినోజ్ పి.సెల్వం



కుక్కర్ గుర్తుకు ఓటేసి అన్నామలైని గెలిపించండి

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి తరఫున అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థిగా తేని నియోజకవర్గంలో పోటీ చేస్తున్న టీటీవీ దినకరన్‌కు కుక్కర్ గుర్తు అంటే చాలా ఇష్టం. మొదటిసారి ఆ గుర్తుపైనే ఆయన ఆర్కేనగర్ శాసనసభ్యుడిగా గెలిచారు. ప్రస్తుతం తేని లోక్‌సభ నియోజకవర్గంలోనే ఆ గుర్తుపైనే పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కోయంబత్తూరులో బీజేపీ అభ్యర్థి అన్నామలైకి మద్దతుగా ప్రచారం చేస్తూ కుక్కర్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వెంటనే ఆయన ప్రచార వాహనం చుట్టూ ఉన్న జనమంతా 'తామర గుర్తు' అని బిగ్గరగా అరిచారు. దినకరన్ గుర్తు మార్చి చెప్పినట్లు తెలుసుకుని తామర, కుక్కర్ గుర్తు రెండూ ఎన్డీయే కూటమిల పార్టీలవే కనుక తప్పుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. ఆ తర్వాత ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రధాని మోదీకి అత్యంత విశ్వాసపాత్రుడైన అన్నామలైని గెలిపించడం ద్వారా దుష్టశక్తి తామరను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆ మాటకు కార్యకర్తలు దిగ్భ్రాంతి చెందారు. వెంటనే దినకరన్ తన తప్పు తెలుసుకుని తామరను గెలిపించండి అంటూ పెద్ద పెట్టున నినాదం చేసి ప్రచారాన్ని ముగించుకుని అక్కడి నుండి బయలుదేరి వెళ్ళారు.

ఆమె కేరాఫ్ తీహార్ జైలు... నా అడ్రస్ రాజ్‌భవన్

● బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందర్‌రాజన్

పెరంబూర్, ఏప్రిల్ 9: తనపై విమర్శలు చేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళిపై దక్షిణ చెన్నై బీజేపీ అభ్యర్థి తమిళిసై తీవ్రంగా మండిపడ్డారు. కనిమొళి కేరాఫ్ తీహార్ జైలు అని, కానీ తన చిరునామా రాజ్‌భవన్ అని ఎద్దేవా చేశారు. నగరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 50 ఏళ్ల డీఎంకే పాలనలో సెంట్రల్ చెన్నై అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాను నియోజకవర్గం పూర్తిగా తిరిగి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి అభ్యర్థులు లేక గవర్నర్లు, కేంద్ర మంత్రులను పోటీలో దించారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ప్రజలకు సేవచేయాలని కోరికగా ఉందని ప్రధాని తెలుపడంతో ఆయన అనుమతులతో గవర్నర్ పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోందని, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా బీజేపీ బలం తెలుస్తుందని తమిళిసై పేర్కొన్నారు.



21 క్రాఫ్ట్సలలో పనిచేసి సొంతంగా సినిమా నిర్మించిన గుహన్ చక్రవర్తి



ఆడియో రిలీజ్ దృశ్యం

సాధారణంగా చిత్రపరిశ్రమలో పని చేసే టెక్నీషియన్లు, నటీనటులు ఒక చిత్ర కోసం నాలుగైదు విభాగాల్లో పని చేస్తుంటారు. కానీ, గుహన్ చక్రవర్తి అనే నటుడు ఏకంగా 21 క్రాఫ్టలలో పని చేయడమే కాకుండా సొంతంగా సినిమాను నిర్మించారు. మాతా పితా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మించిన చిత్రం 'వంగాల విరిగుడ - కురునిల మన్నన్'. గుహన్ చక్రవర్తి హీరోగా నటించారు. ఈ సినిమా కోసం ఆయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, సంగీతం, కెమెరా, కళ, నృత్యం, స్టంట్స్, కాస్ట్యూమ్స్, స్టిల్స్, నేపథ్యగానం, ప్రొడక్షన్ డిజైనర్, టైటలింగ్, కేశాలంకరణ, ఔట్‌డోర్ షూటింగ్ మేనేజ్‌మెంట్, నిర్మాణం, దర్శకత్వ విభాగాల్లో పనిచేశారు. ఈ చిత్రం ఆడియోను సోమవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గుహన్ చక్రవర్తి మాట్లాడుతూ... 'నాకు ఇష్టమైన వాటిలో సినిమా ఒకటి. దాన్ని ఇపుడు మీ ముందుకు తీసుకొచ్చా. పెరియార్, అన్నాదురై, కలైంజర్, స్టాలిన్, అబ్దుల్‌కలాం వంటి మహనీయులను ఒకే పోస్టరులో చూపించాలన్నదే నా తపన. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎపుడు చేప్పే 'కలలు కంటూ జీవించండి' అనే వ్యాఖ్యను మూల కథాంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించా. నాలా బతకొద్దు.. వాళ్లలా జీవించండి అని చెప్పాం. పురట్చి తలైవర్, పురట్చి తలైవి, కలైంజర్, అన్నాదురై జీవించిన గడ్డ విరిగుడ. ఆ విధంగానే ఈ చిత్రం కూడా ఉంటుంది. ఈ సినిమా ద్వారా ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. అబ్దుల్ కలాంపై నాకు కొంత అసంతృప్తి ఉందని చెప్పా. ఈ విషయం తెలుసుకున్న ప్రతి ఒక్కరూ నన్ను దూషించారు. అయితే, అలా ఎందుకు చెప్పానో ఈ సినిమా చూస్తే మీకే అర్థమవుతుంది. మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి వంటి గొప్పనేత ప్రసంగించిన కలైంజర్ అరంగంలో నేను ప్రసంగించే భాగ్యం దక్కినందుకు గర్వంగా ఉంది. ఏ ఒక్కటీ సులభంగా రాదు. నేను శ్రమిస్తాను. జీవిస్తాను' అని పేర్కొన్నారు. ఈ ఆడియో తొలి కాపీని గుహన్ చక్రవర్తి తల్లిదండ్రులు స్వీకరించారు. ఇదే వేదికపై హీరో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చిత్రజ్యోతి

ఐదు భాషల్లో విడుదలకానున్న వరలక్ష్మి చిత్రం



నటి వరలక్ష్మి శరత్‌కుమార్ సోలో హీరోయిన్‌గా నటించిన 'శబరి' చిత్రం ఏకంగా ఐదు భాషల్లో విడుదలకానుంది. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మే 3న విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇటీవల సోలో హీరోయిన్ సినిమాలు వస్తున్నాయి. ఇలాంటి చిత్రాల్లో నటించేందుకు పలువురు అగ్రహీరోయిన్లతో పాటు యువ హీరోయిన్లు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో వరలక్ష్మి శరత్‌కుమార్ 'శబరి' సినిమాలో సోలో హీరోయిన్‌గా నటించారు. గణేష్ వెంకట్రామన్, మధునందన్ వంటివారు ముఖ్య పాత్రలను పోషించారు. డెబ్యూ డైరెక్టర్ అనిల్ కాట్జ్ దర్శకత్వం వహించారు. గోపీసుందర్ సంగీతం అందించారు. మే 3వ తేదీన విడుదలకానున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్.. ఒక కిరాతక హంతక ముఠా చేతికి చిక్కిన తన కుమారుడిని రక్షించుకునే తల్లి పాత్రలో నటించారు. కొత్త కథ, కథనాలతో బలమైన ఎమోషన్స్‌తో నిండిన మూవీగా దర్శకుడు రూపొందించారు.

మేలో విజయ్ సేతుపతి 50వ చిత్రం రిలీజ్

నటనలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ సేతుపతి. ఈయన నటించిన 50వ చిత్రం 'మహారాజా'. చిత్రీకరణ పూర్తి చేసుకుని శరవేగంగా పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. 'కురంగు బొమ్మై' ఫేం నితిలన్ స్వామినాథన్ దర్శకుడు. ఇందులో విజయ్ సేతుపతితో పాటు అనురాగ్ కశ్యప్, మమతా మోహన్ దాస్, నట్టి నటరాజ్ తదితరులు నటిస్తున్నారు. అజనీష్ లోకనాథ్ సంగీతం సమకూర్చగా, దినేష్ పురుషోత్తమన్ ఛాయాగ్రహణం అందించారు. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయగా, మే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫ్యాషన్ స్టూడియోస్ బ్యానరుపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి నిర్మాతలు సుధన్ సుందరం, జగదీష్ పళనిస్వామి.



'మహారాజా'లో విజయ్ సేతుపతి

SCHOLARSHIP ALERT

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000 ***Last Date:*** 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.
ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in

హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు... మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫోర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బుల్గానిన్, డీఓపీ: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్ఛికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.